# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 16-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఫ్రాన్స్‌లోని ఎవియన్ నగరంలో జరుగుతున్న జీ-7 శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సాయంత్రం పాల్గొన్నారు.

- ❖ దగ్గు సిరప్‌ల విక్రయాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలకు గతంలో ఇచ్చిన మినహాయింపులను ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

- ❖ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధికారులను ఆదేశించారు.

- ❖ నీట్ యూజీ-2026 పునఃపరీక్ష నేపథ్యంలో.. ఆన్‌లైన్ మెసేజింగ్ సోషల్ మీడియా యాప్ "టెలిగ్రామ్"పై కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఆంక్షలు విధించింది.

============================

ఫ్రాన్స్‌లోని ఎవియన్ నగరంలో జరుగుతున్న జీ-7 శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొద్ది సేపటి క్రితం పాల్గొన్నారు. "కొత్త భాగస్వామ్యాలను నిర్మించడం, అంతర్జాతీయ ఐక్యతను పునరుద్ధరించడం" అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ ఉన్నత స్థాయి సమావేశంలో జీ-7 దేశాల నాయకులతో పాటు భాగస్వామ్య దేశాల ప్రతినిధులు, ప్రపంచ బ్యాంక్, ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌కు చెందిన కీలక ప్రతినిధులు పాల్గొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రధాని మోదీతో పాటు ఇతర భాగస్వామ్య దేశాల నాయకులకు అధికారిక స్వాగతం పలికిన అనంతరం సమావేశం ప్రారంభమైంది. జీ-7 శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరవడం ఇది వరుసగా ఏడోసారి. ఈ సదస్సులో భారత్ క్రమం తప్పకుండా పాల్గొనడం ద్వారా ప్రపంచ సవాళ్ల పరిష్కారంలో శాంతి, భద్రత, సుస్థిర అభివృద్ధి, ఆర్థిక వృద్ధికి సంబంధించిన అంతర్జాతీయ ప్రయత్నాల్లో భారత్ పాత్ర మరింత పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ జీ-7 సదస్సు సందర్భంగా నరేంద్ర మోదీ పలు దౌత్య కార్యక్రమాల్లో కూడా పాల్గొనున్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ, యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధాని కీర్ స్టార్మర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌లతో భారత ప్రధాని ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026” కార్యక్రమాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సంవిధాన్ సదన్‌లోని చారిత్రాత్మక సెంట్రల్ హాల్‌లో ఈరోజు ప్రారంభించారు. దేశంలోని పలు ప్రాంతాల నుండి హాజరైన యువ ప్రతినిధులను ఉద్దేశించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. `వికసిత్ భారత్` కోసం మార్గసూచిపై చర్చించేటప్పుడు ఈ చారిత్రాత్మక వేదిక నుండి స్ఫూర్తి పొందాలని యువతను ఆయన కోరారు. `వికసిత్ భారత్ 2047` కలను సాకారం చేసే బాధ్యత యువతపైనే ఉందని పేర్కొంటూ.. యువతను దేశ నిర్మాణం వైపు నడిపిస్తున్నందుకు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖను ఆయన ప్రశంసించారు.

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా చేపడుతున్న సన్నాహక చర్యలపై కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ న్యూఢిల్లీలో ఈరోజు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పత్తి ఉత్పత్తిని పెంచడం, పప్పుధాన్యాల్లో స్వయం సమృద్ధి సాధించడం, తక్కువ వర్షపాతం నమోదయ్యే జిల్లాల కోసం ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో ఎదురయ్యే ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి రైతులను రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలను ముందుగానే చేపట్టాలని సూచించారు. వాతావరణ సవాళ్లు ఎదురైనప్పుడు రైతులకు తక్షణ ప్రత్యామ్నాయాలు, సలహాలు, అవసరమైన సహాయాన్ని అందించే విధంగా చర్యలు ఉండాలన్నారు. నీటి సంరక్షణ, నేలలో తేమ నిర్వహణ, అంతర పంటల సాగు, ప్రత్యామ్నాయ పంట విధానాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ యూజీ-2026 పునఃపరీక్ష ఈ నెల 21వ తేదీన జరగనున్న నేపథ్యంలో.. ఆన్‌లైన్ మెసేజింగ్ సోషల్ మీడియా యాప్ “టెలిగ్రామ్”పై కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు ఈ నెల 22వ తేదీ వరకు అమల్లో ఉంటాయి. భారతదేశంలో నిర్దిష్టమైన, పరిమిత కాలానికి టెలిగ్రామ్ యాక్సెస్‌ను నియంత్రించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (MeitY) ఇచ్చిన ఆదేశాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) స్వాగతించింది. ఈ ఆంక్షలు పునఃపరీక్ష జరిగే రోజు, ఆ తర్వాత తక్షణ కాలానికి వర్తిస్తాయని ఎన్‌టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే పోస్ట్ చేసిన సందేశాలను ఎడిట్ చేసే సదుపాయాన్ని ఈ నెల 30వ తేదీ వరకు నిలిపివేయాలని కూడా టెలిగ్రామ్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొంది. జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రశ్నా పత్రాల లీక్‌లపై తప్పుడు ప్రచారాలు, తర్వాత సృష్టించే ఆరోపణలకు ఈ మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కొందరు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని ఎన్‌టీఏ తెలిపింది. అలాంటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“భారత్ ఇన్నోవేట్స్” భవిష్యత్‌కు మార్గదర్శక వేదికగా మారనుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ల ఇరువురి ఉమ్మడి దృష్టి కోణం ఆధారంగా “భారత్ ఇన్నోవేట్స్” రూపుదిద్దుకుందని ఆయన తెలిపారు. ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఈరోజు జరిగిన భారత్ ఇన్నోవేట్స్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న పీయూష్ గోయల్ ప్రసంగిస్తూ... భవిష్యత్తులో ఈ కార్యక్రమం ఒక కొత్త దిశను చూపించే వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేదిక

ద్వారా ఆవిష్కర్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులకు తమ రంగాలకు సంబంధించిన అభిప్రాయాలను, సూచనలను అందించే అవకాశం లభించిందని తెలిపారు. అదే విధంగా భారత్‌లో సౌర ఇంధన రంగం గురించి ప్రస్తావించిన పీయూష్ గోయల్.. దేశ సౌర శక్తి మిషన్ లక్ష్యాన్ని నిర్దేశిత గడువుకు ముందుగానే అధిగమించిందన్నారు. భారత సౌర విద్యుత్ సామర్థ్యం 20 గిగావాట్ల నుంచి 100 గిగావాట్లకు పెరిగిందని పీయూష్ గోయల్ వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దగ్గు సిరప్‌ల విక్రయాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలకు ఇచ్చిన మినహాయింపును ఉపసంహరించుకుంటూ.. కేంద్ర ప్రభుత్వం ఔషధ నిబంధనలు-1945 చట్టంలో సవరణ చేసింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తూ.. ఔషధ నిబంధనలలోని షెడ్యూల్-కేలో “ఔషధాల తరగతి” కింద ఉన్న “సిరప్” అనే పదాన్ని తొలగించినట్లు తెలిపింది. ఈ పదం తొలగింపుతో దగ్గు సిరప్‌లకు ఇంతకుముందు ఉన్న మినహాయింపు ఇకపై వర్తించదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీంతో చిన్న గ్రామాల్లో దగ్గు సిరప్‌ల విక్రయం, పంపిణీ ఇకపై తప్పనిసరిగా లైసెన్స్ పొందిన ఫార్మసీల ద్వారానే జరగాల్సి ఉంటుంది. గతంలో వెయ్యి మంది కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో కొన్ని రిటైల్ లైసెన్సింగ్ నిబంధనలు పాటించకుండా దగ్గు సిరప్‌ల విక్రయానికి అనుమతి ఉండేది. సిరప్ తయారీలపై నియంత్రణ, పర్యవేక్షణను బలోపేతం చేయడం, ప్రజారోగ్య భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నిబంధనలను మార్చడం లక్ష్యంగా ఈ సవరణ తీసుకొచ్చినట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రాచ్యం-భారత్ మధ్య లోతైన సముద్ర పైప్‌లైన్ ప్రాజెక్టుపై ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదనను పరిశీలించడం లేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. మధ్యప్రాచ్య దేశాల నుంచి భారత్‌కు సముద్ర గర్భం ద్వారా ఇంధన పైప్‌లైన్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనిని మధ్యప్రాచ్యం-భారత్ డీప్‌వాటర్ పైప్‌లైన్‌గా పేర్కొంటున్నట్లు వస్తున్న మీడియా కథనాలను మంత్రిత్వ శాఖ గమనించినట్లు తెలిపింది. గుజరాత్‌ను ఒమన్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాలతో అనుసంధానించే ఈ ప్రాజెక్టుపై ఎలాంటి చర్చలు ప్రస్తుతం మంత్రిత్వ శాఖ స్థాయిలో జరగడం లేదని స్పష్టం చేసింది. ఇతర గల్ఫ్ దేశాలతో కూడా ఈ అంశంపై ఎలాంటి చర్చలు, ఒప్పందాల ప్రక్రియ కొనసాగడం లేదని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష-2026 ప్రశ్నా పత్రం లీక్ అయిందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం ఈ ప్రచారం పూర్తిగా తప్పుడు సమాచారమని స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పలు ప్రాంతాలలో రేపు వర్షాలు, మరికొన్ని చోట్ల వేడి గాలుల ప్రభావం ఉంటుందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. కొత్తగా ఏర్పడుతున్న పశ్చిమ అలజడుల ప్రభావంతో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు పశ్చిమ హిమాలయ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =